ప్రజాశక్తి
శనివారం 20 డిసెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి



సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఆసంఘం గౌరవ అధ్యక్షులు జి. ఓబులు, జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ నాయకులు జిల్లా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఓబులు, పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ స్వీపర్ బిల్లులకు చెందిన 12 నెలలు బకాయిలు చెల్లించాలని, వాటర్ బిల్లులు బకాయిలు పదవ తేదీలోపు చెల్లించాలని, ఎఫ్ సి షాపు అన్లోడింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సివిల్ సప్లై డివిజన్ మేనేజర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై యూనియన్ నాయకులు నాగరాజు కొండన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అమలెప్పుడు..?

రేషన్ కార్డు లబ్ధిదారులకు వర్తించని బీమా
కుటుంబ పెద్దను కోల్పోతే పరిహారం శూన్యం
చంద్రన్న బీమాపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



ప్రజాశక్తి-పెనుకొండ

ప్రమాదాలు.. సహజమరణాల్లో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పేదలకు అండగా ఉండే బీమా పథకం అమలుపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా బీమా పథకం అమలుపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. రేషన్ కార్డు ఉన్న కుటుంబ పెద్ద ఆకస్మిక, సహజ మరణం పొందినపుడు ఆ కుటుంబానికి ఆర్థిక ఉపశమనం కలిగించడం కోసం ప్రభుత్వం బీమా పథకం ప్రవేశపెట్టింది. 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా అనే పేరుతో ఈ పథకం అమలు చేసింది.

కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులుగా మారితే రూ.5 లక్షలు, 70 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3లక్షలు అందించే విధంగా పథకం రూపకల్పన చేసింది. జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ఆధ్వర్యంలో బీమా పథకం అమలు చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూంతోపాటు 24 గంటలూ పనిచేసే విధంగా అధికారులను కేటాయించారు. ఫోన్ ద్వారా సమాచారం అందిన వెంటనే వివరాలు నమోదు చేసుకుని, దగ్గరలోని ఏపీఎంలకు, యానిమేటర్లకు విషయం తెలిపి సకాలంలో బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసేలా చర్యలు తీసుకునేవారు.

చంద్రన్న బీమా అమలెప్పుడు..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని 'ప్రజాగళం - ఉమ్మడి మేనిఫెస్టో'లో ఆ పార్టీల నాయకులు హామీచ్చారు. గతం కన్నా మిన్నగా ఆర్థికప్రయోజనం చేకూరుస్తామని గొప్పలు చెప్పారు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తవుతున్నా ఇంతవరకూ చంద్రన్న బీమా పథకం గురించి పార్టీ నాయకులెవరూ మాట్లాడని పరిస్థితి నెలకొంది. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి వారికి బీమా అమలు చేసి ఉంటే కాసింత ఉపశమనం కలిగేదని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమా పథకం అమలకు నోచుకోలేదు. అప్పట్లో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన వారికి ఎలాంటి బీమా అందించలేదు. అడపాదడపా నూటికి ఒకరికో ఇద్దరికి బీమా సొమ్మును అందించి చేతులు దులుపుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

రేషన్ కార్డు లబ్ధిదారులకు వర్తించని బీమా..

ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలి కొదిలేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బీమా పథకం అమలులో తాత్సారం చేస్తోంది. జిల్లాలో రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలు 563028 లక్షలు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ల వారీగా చూస్తే పెనుకొండ 2,298,840, ధర్మవరం-1,33,372, పుట్టపర్తి-96,615, కదిరి-109,101 కలిపి మొత్తం 5,63,028 రేషన్‌కార్డులు ఉన్నాయి. గతేడాది (2024-25)లో వివిధ ప్రమాదాల్లో 489 మంది చనిపోయారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు 375 మంది మరణించారు. ఏటా 900 నుంచి 1100 సహజ మరణాలు నమోదవుతున్నాయి. వందలాది మంది ప్రమాదాల కారణంగా వైకల్యం బారినపడి మంచానపడ్డారు. బీమా పథకం లేకపోవడంతో ఆయా బాధిత కుటుంబాలు రోడ్డునపడ్డాయి. బీమా విషయంపై ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

బీమా పథకం అమలుచేయాలి

కూటమి నాయకులు ఎన్నికల హామీలో భాగమైన చంద్రన్న బీమా పథకం తక్షణమే అమలు చేయాలి. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఎంతో ఉపయోగకరం. ప్రమాదాలు సహజ మరణాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుంది. బీమా సొమ్ము ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది. కూటమి ప్రభుత్వ నాయకులు బీమా పథకం అమలు చేసేందుకు చొరవ చూపాలి.



బాబావలి,
సిఐటియు నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉపాధి హామీ చట్టం సవరణ దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉపాధి హామీ చట్టం మార్పు నిర్ణయం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర నాయకులు జి. ఓబులు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఉపాధి చట్టం పేరు మార్పు, చట్టం సరవణను నిరసిస్తూ శ్రీ సత్య జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి గణేష్ కూడలిలో నాయకులు నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకొని ఆందోళన చేశారు . ఈ సందర్భంగా జి. ఓబులు, రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా చట్టాన్ని సవరించిందని విమర్శించారు. మహాత్మా గాంధీ అంటే ఎందుకు బీజేపీకి సరిపోదని అన్నారు. ఉపాధి హామీ పథకంలో గతంలో కేంద్రం వాటా 90శాతం, రాష్ట్రం వాటా 10 శాతం ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రాల వాటా 40 శాతం చేశారని అన్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు వ్యతిరేకించడంలేదని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. అంబానీ లబ్ధి కోసం బిజెపి ప్రభుత్వం తహతహలాడుతోందని విమర్శించారు. చట్టంలో మార్పు తేవడం వల్ల ఎంతోమంది రైతులు, పేదలు నష్టపోతారని తెలిపారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వం చట్టంలో మార్పు చేసిన విషయాన్ని తెలియజెప్పి ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని అన్నారు. పనులు లేకుంటే పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమవుతుందనిఅనంతపురం జిల్లాలో మళ్లీ వలసలు మొదలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, అన్ని ప్రజా సంఘాలతో కలుపుకుని ఆందోళన చేపడతామన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ఈనెల 22వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. గ్రామీణ కూలీలకు కేంద్ర ప్రభుత్వం మోడీ చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న తెలుగుదేశం జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని, రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంట్లో దీనిని వ్యతిరేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, జంగాలపల్లి పెద్దన్న, హరి, లక్ష్మి నారాయణ, నాయకులు రామచంద్ర, బ్యాల్ల ఆంజి, పైపల్లి గంగధర్, ముత్యాలు, సిద్దు నాగరాజు, షాబాన, రమాదేవి, పెనుకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులపై లాఠీఛార్జి అమానుషం



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద నాయకుల నిరసన

ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్

నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం అమానుషమని మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ తెలిపారు. లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ శుక్రవారం సిఐటియు మండల నాయకులు గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నెల్లూరులో శాంతియుతంగా పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం దుర్మార్గం అన్నారు. నిర్బంధాలతో పోరాటాలను, ఉద్యమాలను అణచాలనుకోవడం ప్రభుత్వ అవివేకం అన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమ్మె కాలం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగార్జున, సాయి, రామయ్య, నరసింహులు, రామాంజినే యులు, రామ్‌దాసు, వెంకటేష్ బాబయ్య, రమణ, రమేష్, గణేష్, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిగిన పోలీసు లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి కళాజ్యోతి, కాలేజీ సర్కిళ్ల మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నాయకులు అయూబ్‌ఖాన్, ఎస్‌హెచ్.బాషా, ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ హామీలు అమలు చేయాలని కోరిన మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, మున్సిపల్ యూనియన్ నాయకులు మేకల బాబు, ముకుంద, లక్ష్మీ, ఓబులేసు, పెద్దక్క, చెన్నకేశవులు, ఆదినారాయణ, వెంకటరాముడు, బాలమురళి, డైలీ వేజ్ కార్మికులు పాల్గొన్నారు.

హిందూపురం : మునిసిపల్ శాఖ మంత్రి ఇలాకా నెల్లూరులో మునిసిపల్ కార్మికుల పై దాడులు అమానుషమని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామనిసిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి ఆర్ రాము అన్నారు. మునిసిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు హిందూపురంలో నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్ లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గత సమ్మె కాలుపు ఒప్పందాలు అమలు చేయాలనీ కోరుతూ గత 41 రోజులుగా ఆందోళన చేపడుతున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించకపోవడమే కాకుండా కార్మికులపై దాడులకు ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ పనులను అవుట్‌సోర్సింగ్ విధానంలో కొనసాగించడం తక్షణమే ఆపాలని, సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు ఉద్యోగ భద్రత, హక్కులను కల్పించాలని కోరారు. మునిసిపల్ శాఖ మంత్రి తక్షణమే స్పందించి అధికారులతో, కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిపి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నెల్లూరు మునిసిపల్ కార్మికులపై లాఠీచార్జ్ చేసిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షులు రామాంజనప్ప, మంజు, సహాయ కార్యదర్శి, నరసింహమూర్తి, చంద్ర, ప్రదీప్, హనుమంతు, బాలాజీ, వినోద్, మహిళా నాయకురాలు కవిత, పుష్పమ్మ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీకి అడ్డంకులు

పోలీసుల ఆంక్షలను వ్యతిరేకిస్తూ ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- హిందూపురం

అన్ని అర్హతలున్న హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఏర్పాటు సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ర్యాలీకి అధికారులు అడ్డంకులు సృష్టించారు. ర్యాలీ నిర్వహణ కోసం ముందుగా పోలీసుల నుండి అనుమతి తీసుకున్నప్పుడు చిన్న మార్కెట్ సర్కిల్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు మాత్రమే ర్యాలీ నిర్వహించాలని ఆంక్షలు విధించారు. ఇందుకు సమితి సభ్యులు సైతం అంగీకరించారు. అయితే సాయంత్రానికల్లా పోలీసులు అభ్యంతరం తెలిపారు. ర్యాలీకి అనుమతి లేదని కమిటీ సభ్యులకు పోలీసులు తెలియజేశారు. దీనికి తోడు వన్ టౌన్ సిఐ లిఖిత పూర్వకంగా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు ర్యాలీకి అనుమతి లేదని, విద్యార్థులను పంపవద్దని ఉత్తర్వులు పంపారు. అయినప్పటికీ జిల్లా సాధన కమిటీ నాయకులు, సంఘాల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ లో నిరసన వ్యక్తం చేశారు. అన్ని అర్హతలు ఉన్న హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం తగదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా సాధన కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ జిల్లా సాధన కోసం నిరసన వ్యక్తం చేశారని, ఉద్యమంలో సైతం పాల్గొని జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి జిల్లా కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని త్రీవ రూపంలోకి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన కమిటీ నాయకులు ఇందాద్, బాలాజీ మనోహర్, ఉమర్ ఫరూక్ ఖాన్, సోమశేఖర్ రెడ్డి, శ్రీరాములు, కె.బి. శంకరయ్య, అమానుల్లా, ఐక్య విద్యార్థి సంఘం నాయకులు కదిరిష్, బాబావలి, అతిక్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ గవర్నెన్స్ వీక్ - 2025ను పటిష్టంగా నిర్వహించాలి : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 19 నుంచి 25 వరకు జిల్లావ్యాప్తంగా గుడ్ గవర్నెన్స్ వీక్-2025 కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగంకార్యదర్శి రచన షాహ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గుడ్ గవర్నెన్స్ వీక్ అమలుపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. వీసీ అనంతరం జేసి మాట్లాడుతూ ప్రశాసన్ గావ్ కి ఓరే' క్యాంపెయిన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం సూచించిన అంశాలన్నింటినీ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి గుడ్ గవర్నెన్స్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారం ద్వారా సేవల మెరుగుదల, రాష్ట్ర ప్రజా ఫిర్యాదుల పోర్టల్‌లో ఫిర్యాదుల సత్వర పరిష్కారం, సిటిజన్ చార్టర్‌ను నవీకరణ, ప్రతి జిల్లా నుంచి ఒక విజయగాథను పీజీ పోర్టల్‌లో షేర్ చేయడం, ఉత్తమ పరిపాలనా పద్ధతులను అమలు చేసి పోర్టల్‌లో పొందుపరచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈనెల 23న జిల్లాస్థాయిలో గుడ్ గవర్నెన్స్ పై వర్క్ షాప్ నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.



వీడియో కాన్ఫరెన్సులో జేసీ

ఖాళీ గదులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి హిందూపురం

పురపాలక సంఘం ఆధీనంలోనిఇందిరా పార్కు, పాత బస్టాండ్, లైబ్రరీ కాంప్లెక్స్ లో ఖాళీగా ఉన్న గదులకు మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేలం పాటలకు పలువురు వ్యాపారులు హాజరయ్యారు. రూ. 2 లక్షలు డిపాజిట్, రూ. 5 లక్షలు విలువైన సాల్వెంచి సమర్పించిన వారు మాత్రమే వేలంపాటల్లో పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు మునిసిపాలిటీ వారు వేలం వేసిన పలు షాపులను దుకాణదారులు దక్కించుకున్నారు. ఎస్టీలకు కేటాయించిన దుకాణాల కేటాయింపు పై ఎరుకుల సంఘం రాష్ట్ర నాయకులు శంకర్ మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. ఎస్టీలకు కేటాయించిన దుకాణాలకు వేలం ప్రకటించారని, వేలం తప్పనిసరిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే దుకాణాలను ఎస్సీ వెల్ఫేర్, ఎస్టీ వేల్ఫేర్ శాఖల నుంచి లబ్ధిదారుల జాబితా కలెక్టర్ కు వెళ్లి ఆయన ఆమోదం మేరకు అక్కడి నుంచి వస్తుందని, వారికి దుకాణాలు కేటాయించాలని మునిసిపల్ అధికారులు నిర్ణయించారు. దీంతో దుకాణాల వేలం పాట నిలిచిపోయింది. కొన్ని దుకాణాలను వ్యాపారులు పోటాపోటీగా దిగి ఎక్కువ మొత్తానికి దక్కించుకున్నారు. వారికి దుకాణాలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి విజయభారతి, ఆర్ఐ షావలి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- హిందూపురం

ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ మనోహర్ పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్‌గా ఉన్న మనోహర్‌కు కూటమి ప్రభుత్వం బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించడం పట్ల శుక్రవారం స్థానిక ఫోటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బెస్త రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్ సమస్యలు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తాననిహామీ ఇచ్చారు. అదేవిధంగా బెస్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్, మిక్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఆర్.చంద్రారెడ్డి రెడ్డి, ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, కార్యదర్శి నాగరాజు, సంయుక్త కార్యదర్శి బిజీ శ్రీనివాసులు, కోశాధికారి సునీల్ కుమార్, కార్యవర్గ సభ్యులు రంగబాబు, గంగాధర్, శ్రీనివాసులు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -హిందూపురం

ఆలోచనలు ఉన్నత స్థాయిలో ఉంటే విద్యార్థులు నూతన ఆవిష్కరణలు కనుగొనవచ్చునని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అన్నారు. పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఏడు విభాగాల్లో నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు వారి గైడ్ టీచర్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరయ్యారు. వైజ్ఞానిక ప్రదర్శనలో న్యాయ నిర్ణేతలు ఏడు అంశాలలో అంశాలలో ఏడుగురు విద్యార్థులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో జరిగే జ్ఞానిక ప్రదర్శనకు వెళుతున్న వారి వివరాలను మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ఓరియంటల్ హై స్కూల్ హెడ్మాస్టర్ పెన్నోబులం ప్రకటించారు. సస్టైనబ్ అగ్రికల్చర్ అంశంలో అంబేద్కర్ గురుకులానికి చెందిన జి.నిత్యశ్రీ , వేస్ట్ మానేజ్మెంట్ అంశంలో రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుసుమిత, గ్రీన్ ఎనర్జీ అంశంలో కొటిపికి చెందిన శబరీష్ , ఎమర్జింగ్ టెక్నాలజీ అంశంలో ఓరియంటల్ హై స్కూల్‌కు చెందిన నందకిషోర్, మాథమెటికల్ మోడల్లింగ్ అంశంలో ముద్దిరెడ్డిపల్లి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సహేరా, హెల్త్ అండ్ హైజిన్ అంశంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన తనూజ శ్రీ, వాటర్ కన్వర్షన్ అండ్ మానేజ్మెంట్ అంశంలో హిందూపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మానస, ఉపాధ్యాయుల విభాగంలో సంతేబిదనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి. శోభ విజేతలుగా నిలిచారు. వీరు శనివారం జిల్లా స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు హాజరు కానున్నారన్నారు.. ఈ ప్రదర్శనలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాటు మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు సహకరిద్దాం

ప్రజాశక్తి హిందూపురం

మహిళల్లో ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన కోసం అందరూ కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని మేళాపురం సర్కిల్ మీ-సేవ సెంటర్, రహమత్ పురం షాదీమహల్ లో ఉచితంగా మహిళలకు సఖి సురక్ష స్క్రీనింగ్ పరీక్షలు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తో పాట ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరాల్లో మహిళలకు థైరాయిడ్, షుగర్, విటమిన్ లోపం, సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఎనీమియా, ప్రోటీన్ లోపం, మానసిక వైద్యానికి సంబంధించి కౌన్సిలింగ్ వంటి 16 రకాల టెస్ట్ లు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది, మెప్మా అధికారులు, సిఒలు, ఒబిసిలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టని వారికి పదవులెందుకు..?

మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లకు ఎమ్మెల్యే సూటి ప్రశ్న



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజల సమస్యలు పట్టని వారికి పదవులు ఎందుకని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వైసిపికి చెందిన మున్సిపల్ ఛైర్మన్, సభ్యులను సూటిగా ప్రశ్నించారు. తాము ప్రజలకు జవాబుదారీగా పని చేస్తామని, అభివృద్ధిలో రాజీ పడబోమని తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఛైర్మన్ తూతూ మంత్రంగా వచ్చి వెళ్లగా మిగతా వైసిపి సభ్యులు మొహం చాటేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఓట్లు వేసి బాధ్యతాయుత పదవులు కట్టబెట్టింది జీతాలు తీసుకోవడానికి మాత్రమే కాదు వారి సమస్యలు పరిష్కరించడానికి అని తెలిపారు. ప్రజల సమస్యలు తీర్చలేని మనకు ఈ పదవులెందుకని ప్రశ్నించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి వైసిపి పాలకవర్గం కూడా అడుగడుగునా అడ్డు పడుతోందని విమర్శించారు. 2 నెలల్లోనే రూ. 15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను కనీ విని ఎరగని రీతిలో నిర్వహించామన్నారు. అండర్ డ్రెయినేజీ వ్యవస్థ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి త్వరలో రూ.60 లక్షలు మంజూరు కానున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వైసిపి ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపట్టామని అవకతవకలు, అనుమానాలకు తావు లేదని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ వెల్లడించారు. సమావేశంలో టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పెడపల్లిలో ఈద్గా నిర్మిస్తాం

పెడపల్లి ఈద్గా నిర్మాణం చేపట్టి ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మండలంలోని పెడపల్లి పంచాయతీలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి సిఎం చంద్రబాబు పెద్దపీట వేశారన్నారు. శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలు జయప్రదం చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షులు విజయకుమార్, శ్రీరామ్‌రెడ్డి, టిడిపి నాయకులు శ్రీరామ్ నాయక్, సామకోటి ఆదినారాయణ, బొమ్మయ్య, పుల్లప్ప, ముస్లింలు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

ఓబులదేవరచెరువు : ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిఐ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అందులో నల్లమాడ, అమడగూరు, ఒడిసి మండలాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించగా ఆస్తి తగదాలు, హౌసింగ్ బిల్లులు, నూతన గృహాలు, పింఛన్లు, తదితర సమస్యలపై సుమారు 88 అర్జీలు అందాయి. వాటిని ఆయా మండలాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్, మండల కన్వీనర్లు జయచంద్ర, గోపాల్‌రెడ్డి, మైలే శివశంకర్, ఆయకులు పిట్టా ఓబుల్ రెడ్డి, ఒడిసి సహకార సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, శివారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నిజాం, కంచి సురేష్, మస్తానమ్మ, బుద్ధల ప్రవీణ, గోపీనాథ్‌రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-నల్లచెరువు


విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత పెంపొందించడంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు కీలక పాత్ర పోషిస్తాయని ఎంఇఒలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవ కుమార్ తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఎంఇఒలు, హెచ్‌ఎం విజయ లక్ష్మితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన శాస్త్రీయ నమూనాలు వారితో పాటు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా సుస్థిర వ్యవసాయం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు, హరిత శక్తి, ఎమర్జింగ్ టెక్నాలజీ, ఆరోగ్యం-పారిశుధ్యం, నీటి సంరక్షణ, ఇంజినీరింగ్, తదితర అంశాలపై విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను ఎంఇఒలు అభినందించారు. మండల స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ప్రయోగాలను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్‌కుమార్‌రెడ్డి, రెడ్డమ్మ, సౌజన్య, విజయ్‌కుమారి, పద్మావతి, భారతి, సల్మా, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక ఒరియంటల్ పాఠశాలలో హెచ్‌ఎం గిరి ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశారు. అందులో మండలంలోని అన్ని హై స్కూళ్ల విద్యార్థులు సైన్స్, గణితం, సోషల్ స్టడీస్‌కి సంబంధించిన నమూనాలను ఏర్పాటు చేశారు. వాటిలో 8 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఇఒలు నాగరాజు నాయక్, కుళ్లాయప్ప తెలిపారు.

గుడిబండ : స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌లో మండలంలోని హైస్కూళ్ల విద్యార్థులు వారు తయారుచేసిన నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఇఒ ప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎంలు గోవిందప్ప, సుజాత, నరసింహమూర్తి, ఎంజెపి, కెజిబివి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు హాజరు అయ్యారు.



నల్లచెరువులో విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఎంఇఒలు



పార్టీలో చేరిన వారికి టిడిపి కండువా వేస్తున్న తిప్పేస్వామి

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర రూరల్

అగళి మండలం పి.బ్యాడగెర గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శుక్రవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వ్యక్తిగత కార్యాలయంలో టిడిపిలో చేరారు. శివన్న, నాగరాజు, రాజప్ప, లింగప్ప, కొల్లారప్ప, హనుమంతరాయప్ప, అశ్వత్థ, లింగరాజు, నాగేంద్ర, అజయ్‌లకు గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం, నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టిడిపిలో చేరి నట్లు తెలిపారు.

భూ సమస్యలపై గ్రామసభ

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని శివరం గ్రామంలో శుక్రవారం రైతుల భూసమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఆర్ఐ పాల్ మాట్లాడుతూ 2024 జూన్ 15వ తేదీ వరకూ రిజిస్టర్ కానీ భూముల అగ్రిమెంట్ మీద గాని, సాదా బైనామా మీద కొనుగోలు చేసిన డాక్యుమెంట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు చిన్న, సన్నకారు రైతులు గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని కూటాగుళ్ల కొత్త రైల్వే బ్రిడ్జి పనుల్లో భాగంగా కొత్త విద్యుత్ లైన్ వేస్తున్న నేపథ్యంలో శనివారం పట్టణంలోని సైదాపురం, అభిరుచి దాబా, కుమ్మరోళ్లపల్లి, ఎర్రగుంటపల్లి, హౌసింగ్ కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పరిగి

వినియోగదారుల సంఘం వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షులు వెంకటరమణప్ప మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రజల సమస్యలు తెలుసుకొని అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఏజెన్సీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ లక్ష్మీదేవి, హెచ్‌ఎం కృపాసత్యరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో పట్టణంలోని బలిజ కళ్యాణ మండపం వద్ద రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోపు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.


'వశిష్ట' విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

స్థానిక వశిష్ట పాఠశాలలో సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిమ కనబరిచిన 25 మంది విద్యార్థులకు శుక్రవారం సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత, పెద్దలు, తల్లిదండ్రుల పట్ల గౌరవం ఉండాలని సూచించారు. అనంతరం సిఐ, ఎస్ఐలను పాఠశాల యాజ మాన్యం సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-తలుపుల



శంకరప్రసాద్

మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని టిడిపి మండల నూతన కన్వీనర్ శంకరప్రసాద్ తెలిపారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులను కలుపుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 17 పంచాయతీల్లో టిడిపి జెండా ఎగరవేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి మండల కన్వీనర్‌గా నియమించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మండల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని మైలేపల్లి సమీపంలో ఓ మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. కొత్తచెరువులోని చాకలి వీధికి చెందిన చాకల గంగాద్రి భార్య జయమ్మ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడేది. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రైలు కింద పడింది. విషయం తెలిసిన వెంటనే హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల ఫారంలో షార్ట్ సర్క్యూట్.. 2 వేల పిల్లలు మృతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని టేకులోడు పంచాయతీ ఆరుమాకులపల్లి గ్రామానికి చెందిన భయపరెడ్డికి చెందిన కోళ్ల ఫారంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఫారంలో ఉన్న దాదాపు 2 వేల కోడి పిల్లలు మృతి చెందడంతో పాటు షెడ్డు, పరికరాలు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హంద్రీనీవా జలాలతో చెరువులన్నీ నింపుతాం

ప్రజాశక్తి-లేపాక్షి



గ్రీవెన్స్‌లో పాల్గొన్న టిడిపి నాయకులు, అధికారులు

మండలంలోని అన్ని చెరువులను హంద్రీనీవా జలాలతో నింపుతామని ఎమ్మెల్యే బాలయ్య పిఎ వీరయ్య తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రజలు అర్జీ ఇస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపుతామన్నారు. మండలంలో రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. తహశీల్దార్ సౌజన్య లక్ష్మి మాట్లాడుతూ కొండూరు పొలంలో సుమారు 500 ఎకరాలు భూమిని త్వరలోనే సెజ్‌కి నోటిఫికేషన్ ఇస్తామని, ఆ తర్వాత గ్రామసభలు నిర్వహించి రైతులకు కనీస మద్దతూ ధర నిర్ణయిస్తామ న్నారు. ప్రజల నుంచి మొత్తం 58 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎంపిడిఒ నర్సింహమూర్తి, విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు దివ్య, నాగరత్నమ్మ, చిరంజీవి, నాయకులు అభిలాష్, ఆనంద కుమార్, బాలాజీగౌడ్, నరసింహమూర్తి, పంచాయతీ కార్యాదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 11 అంగన్వాడీ కార్యకర్త, 58 ఆయా పోస్టులకు ఈ నెల 30వ తేదీ లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.ప్రమీలారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి, సికె.పల్లి, బత్తలపల్లి, ధర్మవరం, గుడిబండ, హిందూపురం, కదిరి, మడకశిరర, నల్లచెరువు, ఓడిచెరువు, పెనుకొండ, సోమందేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు సంబంధిత సిడిపిఒ కార్యాలయంలో సంప్రదించాలని, ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకూ అక్కడే దరఖాస్తులు లభిస్తాయన్నారు.

షాపింగ్ గదులకు..

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 7 గదులను ఎస్సీలకు కేటాయించి నట్లు సర్పంచి రాధానాగరాజు, ఇన్‌ఛార్జి కార్యదర్శి జనార్ధన్ రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ 1, 8, 34, 35, 42, 44, 48 గదులు ఖాళీగా ఉన్నాయని, మండలంలో నివసిస్తున్న ఎస్సీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను అనంతపురంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవ సహకార సంఘం కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ లోపు అందజేయాలన్నారు

ఉర్దూ అకాడమీకి 50 ఏళ్లు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఎపి ఉర్దూ అకాడమీ ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఎపి ఉర్దూ అకాడమీ ఆధర్వంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అలాగే దేశం కోసం అసువులు బాసిన బిస్మిల్లా అష్ఫకుల్లా ఖాన్, బిస్మిల్లా, రామ్‌ప్రసాద్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడుతూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను, కౌన్సిలర్లు ఇస్మాయిల్, బండారు మురళి, మహబూబ్ బాషా, నాయకులు కెఎస్.బహవుద్దీన్, గంగాధర్, శరత్‌కుమార్‌రెడ్డి, ర్దూ అకాడమీ, లైబ్రరీ నిర్వాహకులు హఫీజ్, షామీర్‌బాషా, అశ్వక్‌బాషా, సంజీదా సిద్ధికి, అల్లాబకాష్, హైదర్, షానవాజ్ పాల్గొన్నారు.

మధుమేహంపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మధుమేహం వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సంతోష్, రమేష్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం అధికారులు, తిమ్మమాంబ మండల సమైక్య లీడర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారు సీజనల్ వ్యాధులు, వ్యాయామంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం వెంకట నారా యణ, సీసీలు బాబాసాహెబ్, బాబ్‌జాన్, రెడ్డప్ప, ఇస్మాయిల్, యానిమేటర్స్, సభ్యులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని దిన్నమీదపల్లి గాంధీనగర్ రహదారిని శుక్రవారం తహశీల్దార్ దేవేంద్ర నాయక్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కె.అంజనప్ప గృహ నిర్మాణంలో భాగంగా రహదారిని ఆక్రమించుకున్నారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు సర్వేయర్, వీఆర్వోతో కలిసి కొలతలు వేసి హద్దులు నిర్ధారించామన్నారు. గ్రామకంఠం స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించుకోరాదని, ఇల్లు లేని వారిని మా దృష్టికి తీసుకొస్తే ఇంటి పట్టా మంజూరు చేస్తామని తెలిపారు. ఆయన వెంట వీఆర్వో శకుంతల, గ్రామ సర్వేయర్ హర్షవర్ధన్ ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న తహశీల్దార్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాదర్బార్‌లో పరిటాల శ్రీరామ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నియోజవర్గంలో అవసరం ఉన్న చోట సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మిస్తామని తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవపురం కూడలిలో ఉన్న టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో శ్రీరామ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను ప్రస్తావించగా యుద్ధ ప్రాతిపదికన వాటిని నిర్మించేలా చూస్తామన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సందా రాఘవ, పరిసే సుధాకర్, మహేష్ చౌదరి, నాగూర్ హుసేన్, షరీఫ్, కాటమయ్య, మాధవరెడ్డి, బీమినేని ప్రసాద్, శ్రీనివాసులు, పురుషోత్తంగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

ముదిగుబ్బ : సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పరిటాల శ్రీరామ్ ధర్మవరం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ముదిగుబ్బ మండలం పిసి రేవు గ్రామానికి చెందిన రాగే నారాయణస్వామికి రూ. 1,20,859, ముదిగుబ్బ టౌన్‌కు చెందిన షేక్‌హుస్సేన్ పీరాకు రూ.1,00,527 విలువైన చెక్కులను అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ సిఎం సహాయ నిధి ద్వారా పేదలు, బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు : ఎంపిడిఒ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నటరాజు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఉపాధి హామీ నిధులను గ్రామపంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నటరాజు సూచించారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం వైస్ ఎంపిపి గంగరాజు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఐదు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాల న్నారు. తలమర్ల, మైలేపల్లి, కదిరేపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని సభ్యులు ఎంఇఒ సోమశేఖర్‌ను కోరారు. కొత్తచెరువులో అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీలు నిర్మించాలని సిడిపిఒ జయంతి విన్నవించారు. అన్ని పంచాయతీల్లో సర్వే చేసి ఇల్లు లేని 792 మందిని గుర్తించా మని, వారికి త్వరలోనే గృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఎపిఎం నారాయణమ్మ మాట్లాడుతూ రైతు సంఘాలు ఏర్పాటు చేశామని, వారికి ప్రభుత్వం రుణాలతో పాటు రాయితీపై ఎరువులు, విత్తనాలు ఇస్తుందన్నారు. కేశాపురం సర్పంచి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించాలన్నారు. సమావేశంలో విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు, పిఆర్ జెఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ ఓబులేసు, సర్పంచి రాధా, ఇన్‌ఛార్జి కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం


ప్రజాశక్తి-నల్లచెరువు

పోలియో రహిత సమాజం నిర్మిద్దామని పిహెచ్‌సిల వైద్యాధికారులు పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యంలో నల్లచెరువులో 'నిండు జీవితానికి రెండు చుక్కలు' అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రవినాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆ రోజు వేయించని పిల్లలకు 22, 23 తేదీల్లో వారి ఇంటి వద్దకే వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ర్యాలీ పిహెచ్‌సి నుంచి బస్టాండ్ సర్కిల్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకూ నిర్వహించారు. ర్యాలీలో సూపర్వైజర్, వైద్య సిబంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : ఈ నెల 21వ తేదీ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి పోలియో రహిత మండలంగా మార్చాలి పిహెచ్‌సి వైద్యాధికారిణి అపర్ణ పిలుపునిచ్చారు. స్థానిక పిహెచ్‌సి నుంచి వైద్య సిబ్బంది బస్టాండ్ కూడలి, పోలీస్ స్టేషన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అపర్ణ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఫక్రుద్దీన్, సూపర్వైజర్స్ బాషా,హెల్త్ ఆసిస్టెంట్స్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'హలో బహుజన.. చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర రూరల్



'హలో బహుజన చలో ఢిల్లీ' పోస్టర్‌ను విడుదల చేస్తున్న రఘువీరా

దళిత హక్కుల పోరాట సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జనవరి 31వ తేదీ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో తన నివాసం వద్ద సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి 'హలో బహుజన చలో ఢిల్లీ' కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా నుంచి బహుజనులు అధి సంఖ్యలో తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు హనుమంతు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మంజునాథ్, హనుమంతరాయుడు, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు

పశుపోషణ, వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం



శిక్షణకు హాజరైన లీడర్స్

చెలిమి కార్యక్రమంలో భాగంగా శుక్రవా రం స్థానిక అనంత శక్తి సొసైటీ కార్యాలయంలో లీడర్స్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సిరి సీఈఓ తిరుమలదేవి చిన్న జీవాలు, పశువుల వైద్యం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ రవి మాట్లాడుతూ పశుపోషణ, సేంద్రియ వ్యవసాయానికి ఉన్న సంబంధం గురించి వివరించారు. చెలిమి కార్యక్రమం ద్వారా ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, గ్రామ స్థాయిలో లీడర్స్ తీసుకోవాల్సిన బాధ్యతలు, పాత్రపై స్పష్టంగా వివరించారు. రాబోయే 3 నెలల్లో అమలు చేసే కార్యక్రమాలు, లీడర్స్ నిర్వహించాల్సిన బాధ్యతలపై చర్చించారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ కోఆర్డినేటర్ సన్నప్పయ్య, చెలిమి కార్యక్రమం కోఆర్డినేటర్ కె.రవి, 62 మంది లీడర్స్, వాటర్ ఎక్స్‌పర్ట్ ప్రవీణ్, కార్యకర్తలు గంగాధర్, సునందమ్మ, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

బందోబస్తు మధ్య గొల్లపల్లికి సంగాలప్ప ఉత్సవ విగ్రహాలు

ప్రజాశక్తి బత్తలపల్లి



సంగాలప్ప ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ప్రజలు

మండలంలోని యర్రాయపల్లి గ్రామం నుంచి శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామానికి సంగాలప్ప స్వామి ఉత్సవ విగ్రహాలు తరలివెళ్లాయి. విగ్రహం అప్పగింతకు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన కురుబ సామాజికవర్గంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వందేళ్ల నాటి వివాదానికి సుప్రీంకోర్టు గత నెల 11వ తేదీన తెరదించింది. సంగాలప్పస్వామి విగ్రహం అప్పగింత, పూజలకు సంబంధించిన రాజ్ డిగ్రీని బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామానికి చెందిన కమతం వంశీకులు ఉల్లంఘించినందున వారి నుంచి విగ్రహాల ను ఇప్పించాలని రాప్తాడు మండలం గంగులకుంట గ్రామానికి చెందిన కపాడం వంశీకులు దాఖలు చేసిన అప్పీలును గత నెల 11వ తేదీన సుప్రీం కోర్టు కొట్టివేసింది. దీంతో యర్రాయపల్లిలోని కమతం వంశీకులు తమ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయిందుకున్నారు. ఈ నేపథ్యంలో రాప్తాడు మండలం గొల్లపల్లికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో గంగులకుంటు గ్రామస్తులు తాము తీర్పుపైన పిటీషన్ వేశామని, ఉత్సవ విగ్రహం ఊరేగింపును అడ్డుకుంటామని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అధికారులు రంగంలోకి దిగారు. ఇరువర్గాలకు చెందిన వారితో సత్యసాయి, అనంతపురం జిల్లా ఉన్నతాధికారులు పీస్ సమావేశం ఏర్పాటు చేశారు ఇరువర్గాల వారిని పోలీసులు బైండోవర్ చేసి ఊరేగింపు ప్రశాంతంగా నిర్వహించేం దుకు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామంలో వంద మంది పోలీసులతో ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 20 మంది ఎఎస్ఐలు, 20 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 80 మంది పోలీసులు, మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. బత్తలపల్లి తహశీల్దార్ స్వర్ణలతతో పాటు మండలంలోని రెవెన్యూ సిబ్బంది అందరూ గ్రామంలోనే ఉండిపోయారు. సాయంత్రం యర్రాయపల్లి గ్రామంలో ఊరేగింపుగా స్వామి వారిని సాగనంపారు. గ్రామం చివర వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆనంతరం ఐచర్ వాహనంలో ఎక్కించి భారీ పోలీసు బందోబస్తు మధ్య గొల్లపల్లికి తరలివెళ్లారు. మండలంలోని ఈదుల ముష్టూరు, ధర్మవరం మండలం చింతలపల్లి, చిగిచెర్ల మీదుగా గొల్లపల్లికి చేరుకుంది. అక్కడ రాత్రి గొల్లపల్లయ్యస్వామితో కలిసి గ్రామోత్సవం నిర్వహించి తిరిగి శనివారం మధ్యాహ్నం యర్రాయపల్లికి చేరుకుంటుందని నిర్వాకులు తెలిపారు. గొల్లపల్లిలో కూడా దాదాపు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు స్వామి కావులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

IN THE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
O.S. No: 1706/2023

Between:
State Bank Of India,Tilak Road branch, Rep. by its Branch Manager, Anantapuramu ...Plaintiff
And
Challa Ram Mohan ...Defendant

NOTICE TO DEFENDANT

To,
C.Ram Mohan S/o C.Vemaiah,R/at D.No.5-3A, Indukoori Palli Village, S.V.Palli Post, Talupula Mandal, Kadiri Taluka, Sri Satya Sai Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 11-03-2026వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.CHANDRASEKHAR RAO,
Advocate, Anantapuramu, Cell:9848504780

మహారాజశ్రీసీనియర్ సివిల్ జడ్జి పెనుకొండ
I.P.No:12/2024

Between:
షేక్ రఫీక్ అండ్ అదర్ ...పిటీషనర్స్
మరియు
షేక్ కుర్షీద్ అండ్ 21 అదర్స్ ...రెస్పాండెంట్స్

ప్రతివాది నెం:16 హాజరు నోటీసు

R16:- చిన్న శ్రీరాములు S/o రెడ్డి శ్రీరాములు వయస్సు 55 సం॥, హిందూ బిజినెస్. R/o D.No: Not Known, ఇసుకస్ట్రీట్, కొత్తచెరవు (V&M), శ్రీ సత్యసాయి జిల్లా.
పై దావాలో నీ హాజరు నిమిత్తం 24-12-2025 తేదీన పై కోర్టులో వాయిదా వేసినారు. వాయిదా రోజు నీవు కోర్టు వారి ఎదుట ఉ॥10:30 గంటలకు, నీవు స్వయంగా గాని లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా అక్షేపణలున్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు కాని యెడల పై దావాలో నీ పరోక్షమున తీర్మానించెదురు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:24/12/2025
స్థలం:పెనుకొండ
వై.లక్ష్మీనారాయణ, న్యాయవాది, పెనుకొండ,
పి.అంజినేయులు, ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి న్యాయవాది, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
వాదులతరపున న్యాయవాదులు,
సెల్:9848697944